

ఖానాపూర్ రూరల్ : రాజురాలో ఎల్ ఈడి ప్రొజెక్టర్‌పై పథకాలను తిలకిస్తున్న గ్రామస్తులు

# బీఆర్ఎస్ ప్రచార హోరు

ఖానాపూర్ రూరల్/దస్తురాబాద్, అక్టోబర్ 22 : గ్రామ గ్రామాన బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతున్నది. పార్టీ ప్రచార వాహనాలు విస్తృత స్థాయిలో దూసుకెళ్తున్నాయి. ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ తరపున ప్రచార రథాలు తిరుగుతున్నాయి. ఖానాపూర్ మండలం రాజురాలో ఆదివారం ఎల్ఈడీ ప్రొజెక్టర్‌తో పథకాలపై ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన చిత్రాలను గ్రామస్తులందరూ ఓ చోట చేరి తిలకించారు.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీటీసీ కోవ రాజేశ్వర్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 22 : బీఆర్ఎస్‌తోనే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని పార్టీ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్ అన్నారు. మండలంలోని హీరాపూర్, మోడిగూడ, పాటగూడ గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీటీసీలు కోవ రాజేశ్వర్, మడావి భీంరావ్, మాజీ ఎంపీటీసీ కనక హనుమంత్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు తొడసం హరిదాస్, బాల్‌సింగ్, పరశురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో..
# లాభాలు బాగు

- వరిసాగులో సరైన జాగ్రత్తలతోనే అధిక దిగుబడి
- పురుగు మందుల వాడకం తగ్గించాలి
- వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి



వరి పైరుకు ఎరువులు చల్లుతున్న రైతు

దస్తురాబాద్, అక్టోబర్ 22 : వరి సాగులో సమయానికి సరైన జాగ్రత్తలు తీసుకుంటే మంచి లాభాలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు. అందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ, యాజమాన్య పద్ధతులు అవలంభించాలి. దస్తురాబాద్ మండలంలోని రేవోజీపేట, దస్తురాబాద్ క్లస్టర్లలో 8,881.38 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. దిగుబడులు పొందేందుకు కొందరు రైతులు ఇష్టానుసారంగా ఎరువులు, మందులు వాడుతున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులతో పాటు నష్టాలు వచ్చే అవకాశం ఉంది. అది నివారించాలంటే భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 నుంచి 16 కిలోల పోటాష్ లభించే ఎరువులను మాత్రమే వాడాలి. అందుకు అనుగుణంగా పంట సాగుకు ఎరువులు వాడితే మంచి ఫలితాలు వస్తాయి. మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడితే తెగులు వచ్చే ప్రమాదం ఉంది. తద్వారా నష్టపోయే అవకాశమూ ఉన్నది. కాబట్టి ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి, వారి సలహాలు, సూచనలు పాటించాలి.

### మూడు విడుతలుగా యూరియా..

వరి పైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. నత్రజనిని కాంప్లెక్స్ ఎరువులు, యూరియా రూపంలో వాడొచ్చు. దీనిని మూడు దఫాలుగా ఉపయోగించాలి. నాట్లు వేసే ముందు, దుబ్బు చేసే ముందు, అంకురం(పిలకాలు) ఏర్పడే దశలో నత్రజనిని అందించే ఎరువులను వాడుకోవాలి. ఎకరానికి 23 నుంచి 32 కిలోల నత్రజని అందించాలంటే 55 నుంచి 70 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమాన భాగాలుగా విభజించి, చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన స్థాయిలో లేకుంటే అదనంగా 10 నుంచి 15 కిలోల వరకు యూరియా వాడొచ్చు. లేకపోతే 50 కిలోల యూరియాకి 10 కిలోల వేప పిండి గానీ, 250 కిలోల తేమ కల్గిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది. యూరియా అధిక వినియోగంతో అనేక అనర్థాలు ఎదురవుతాయి.

### సకాలంలో భాస్వరం అందించాలి..

మొక్కల వేర్ల పెరుగుదలకు పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాటు వేసే ముందు దమ్ములో, నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాలి. భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను పొరపాటుగా వేయరాదు. నత్రజని ఎరువులను బురద పదునులో వేసి, తర్వాత నీరు పెట్టాలి. యూరియా చల్లిన 48 గంటల తర్వాత తప్పనిసరిగా నీటిని అందజేయాలి.

### జింక్ ధాతు లోపం..

సాధారణంగా జింక్ లోపం చలికాలం, చౌడు పొలాలు, మురుగు సమస్య ఉండే చేలల్లో కనిపిస్తుంది. వరి నాటిన 2 నుంచి 4 వారాల్లో ఈ లోపం కనిపిస్తుంది. ముదురాకు చివర తుప్పు మచ్చలు ఏర్పడి, ఆకులు పెలుసుగా తయారవుతాయి. జింక్ లోపం నివారణకు 20 కిలోల జింక్ సల్ఫేట్, ఎకరానికి చివరి దమ్ములో వేయాలి. లేకపోతే 0.2 శాతం జింక్ సల్ఫేట్‌ను, నాలుగైదు రోజులకోసారి రెండు, మూడు పర్యాయాలు పైరు ఆకులు తడిచేలా పిచికారి చేయాలి. జింక్ సల్ఫేట్‌ను ఎలాంటి పురుగు, తెగులు మందులతో కలిపి పిచికారీ చేయరాదు. జింక్ సల్ఫేట్ పిచికారీ చేసిన తర్వాత 25-30 కిలోల యూరియా ఎకరానికి వేయాలి.

### సూచనలు, సలహాలు పాటించాలి..



*రైతులు నిత్యం పొలానికి వెళ్లి పంట పరిస్థితి గమనించాలి. తెగులు, సమస్యలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. వారి సలహాలు, సూచనల మేరకు మందులు వాడి సమస్య పరిష్కరించుకోవాలి. వరిలో ఇనుము లోపం కూడా రావచ్చు. దాని నివారణకు 20-30 గ్రాముల అన్నభేది చూర్ణం లేక(ఫెర్రస్ సల్ఫేట్) మూడు గ్రాముల నిమ్మ ఉప్పు, లీటరు నీటిలో కలిపి పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. రైతులు సొంత నిర్ణయాలు తీసుకోకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.*

**- జాడి తిరుపతి, ఏఈవో, దస్తురాబాద్ క్లస్టర్**



# బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఉట్నూర్,అక్టోబర్ 22 : మండలంలోని హస్నాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు జాదవ్ అజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

# దుర్గాదేవీ మండపంలో హోమం

ఇంద్రవెల్లి, అక్టోబర్ 22 : ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని రాధాకృష్ణ మందిరం ఆవరణలో కొలువుదిరిన దుర్గాదేవి మండపంలో ఆదివారం రాందాస్ మహరాజ్ ఆధ్వర్యంలో సామూహిక హోమం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతీ పటేల్ డోంగ్రె దంపతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మారుతీపటేల్ డోంగ్రే దంపతులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేందర్

# దసరా ఏర్పాట్ల పరిశీలన

ఖానాపూర్, అక్టోబర్ 22 : ఖానాపూర్ పట్టణంలో సోమవారం జరిగే దసరా ఏర్పాట్లను హిందూ ఉత్సవ సమితి నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ కళాశాల ఆవరణలో భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్న రావణ ప్రతిమ తయారీలను సందర్శించారు. ఉత్సవాలు విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని, పోలీసుల ఆధ్వర్యంలో తగు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, సీఐ మోహన్, నాయకులు ప్రదీప్, రాజేందర్, ప్రవీణ్, మహేశ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.